# దేశం (భూమి)

సర్వవృష్టిని సృజించిన సృష్టికర్త సర్వానికి అధిపతి దేవుడేనని ఇశ్రాయేలు ప్రజల విశ్వాసం (ఆది 1,2 అధ్యాయాలు). కనాను దేశం అబ్రాహాం సంతానమైన ఇశ్రాయేలీయులు స్వదేశ మవుతుందని దేవుడు అబ్రాహాంత వాగ్దానం చేశాడు (ఆది 15:7-21). ఇశ్రాయేలీయులను ఈజిప్టు నుంచి విడిపించి వారిని కనాను దేవుని సరిహద్దులకు చేర్చిన మోషేతోకూడా దేవుడు ఈ వాగ్దానాన్ని పునరుద్ఘాటించాడు (నిర్గమ 3:7,10).

లేవి గోత్రం మినహా ఇశ్రాయేలు గోత్రాలన్నింటికీ దేవుడు స్వాస్థ్య భూమి నిచ్చాడు (యెహోషువ 13:8-21:45). ప్రతి గోత్రానికి లభించిన స్వాస్థ్యం (సంఖ్యా 36:5-9) తరతరాలకు ఆ గోత్రానికే చెందాలి (27:2-11). నలభై తొమ్మిది సంవత్సరాల కొకసారి వచ్చే సునాద సంవత్సరంలో (లేవీయ 25:23,28, సంఖ్యా 25:8-17) క్రయవిక్రయాలకు లోనైన భూమి అసలు హక్కుదారులకు తిరిగి చెందుతుంది. ఈ ఆజ్ఞను ఎవరూ కచ్చితంగా పాటించనప్పటికీ భూమి దేవునిదని మటుకు యిది గుర్తు చేస్తుంది. భూమిని స్వాధీన పరచుకొని ఎవరూ బలవంతులు కాకుండా, భూమిలేని కారణంగా జీవనాధారం కోల్పోయి ఎవరూ నిరుపేదలు కాకుండా ఈ ఆజ్ఞ కొన్ని పరిమితులు విధిస్తుంది.

భూమికి అసలు యజమాని దేవుడు కాబట్టి ప్రజలు భూమిపట్ల తగు శ్రద్ధ చూపాలి (లేవీయ 25:1-7). భూమి కలిగినవారికి యితరుల అవసరాలను తీర్చవలసిన బాధ్యత కూడ వుంది (నిర్గమ 23:10,11; లేవీయ 19:9,10; 23:22; ద్వితీ 24:19-22). దేవుడు మనుషుల పట్ల దయ చూపించినట్టు మనుషులు కూడా ఒకరి పట్ల దయా గుణాన్ని చూపడానికి భూమి అవకాశాన్ని కల్పిస్తుంది.

ప్రజల అవిధేయత దేశాన్ని అపవిత్ర పరుస్తుంది (సంఖ్యా 35:33,34). యితరులకు కలిగిన నష్టానికి తగిన విధంగా నష్ట పరిహారం చెల్లించాలి. ప్రజలు చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తార్థబలులు అర్పించాలి. అప్పుడే మనుషులు పవిత్రులౌతారు. వారితో బాటు దేశం పవిత్రమౌతుంది (నిర్గమ 21:12-36; లేవీయ 4:1-5:19). ఇశ్రాయేలీయుల పాపాలు దేశాన్ని అపవిత్రపరచాయని యెహెజ్కేలు ప్రవక్త కూడా సెలవిచ్చాడు (యెహెజ్కేలు 36:17-20).

ఇశ్రాయేలు యూదా ప్రజలు వారి వారి దేశాల్ల నివసించకుండా చెర ననుభవించడానికి కారణం వారిపాపాలేనని అనేక మంది ప్రవక్తలు సెలవిచ్చారు (యెషయా 1:2-9);యిర్మియా 7:7-17; 10:17-21; యెహెజ్కేలు 5:4-12; 9:1-3; మీకా 1:16).